# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 29-03-2025 | సంపుటి : 06 | సంచిక : 319 | పేజీలు : 8 | వెల : రూ 1-00


## వృద్ధురాలి అనుమానస్పద మృతి

ఏలూరు ఏలూరు జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన శనాపతి రమణమ్మ అనే వృద్ధురాలి అనుమానాస్పద మృతి ఘటన తెలియగానే జిల్లా ఇన్చార్జి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఏలూరు వన్ టౌన్ సీఐ జి. సత్యనారాయణ, ఏలూరు టూ టౌన్ సీఐ వై.వి. రమణ, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ లను రంగంలోకి దించారు. వివిధ కోణాల్లో దర్యాప్తు జరిపి, సంబంధిత సాక్ష్యాలను సేకరించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసారు. ప్రాథమిక విచారణలో కొన్ని కీలకమైన ఆధారాలు లభించాయి. మృతురాలి కుటుంబ సభ్యులు, స్నేహితులు, మరియు స్థానికులతో పోలీసులు మాట్లాడి, మరింత సమాచారం సేకరిస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తును కొనసాగిస్తూ, నిజమైన కారణాన్ని వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లుగా అయన వెల్లడించారు.






# సీఎం చంద్రబాబును అభినందించిన ఎంపీలు..



న్యూఢిల్లీ: పార్లమెంట్ లో అరకు కాఫీ ప్రారంభం సందర్భంగా పలువురు ఎంపీలు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అభినందించారు. ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ... చాలా మంది ఎంపీలు తమ ప్రాంతంలో అరకు కాఫీని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. ఏపీ రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు తపన పడుతున్నారని, ప్రజలు ఆయనపై విశ్వాసం, నమ్మకం పెట్టుకున్నారని, దేశంలో చంద్రబాబు నాయుడు ఒక సీనియర్ నాయకుడని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రధాని మోదీ, కేంద్రమంత్రులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీకి 11 సీట్లుకే పరిమితం చేసి.. గుణపాఠం చెప్పినా ఆ పార్టీ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి ఆలోచన ధోరణి ఇంకా మారలేదని ఎంపీ అప్పలనాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు.అరకు కాఫీ కి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్ సభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ లో సోమవారం ఉదయం (24వ తేదీ) అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు అయ్యాయి. సభాపతి ఆదేశంతో రెండు స్టాల్స్ ఏర్పాటుకు లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఎంపీలు అల్పాహారం తీసుకునే సంగం కాంటీన్‌లో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసింది. లోకసభ కాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అరకు స్టాల్ ప్రారంభించారు. రాజ్యసభ కాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ, బీజేపీ ఎంపీలు హాజరయ్యారు.తూర్పు కనుమల నుండి భారత దేశ పార్లమెంట్ వరకు అరకు వ్యాలీ కాఫీ ప్రస్థానం దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని, ఏపీ రాష్ట్ర గిరిజనుల కష్టాన్ని ప్రపంచం గుర్తించబోతోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గిరిజనుల స్వహస్తాలతో పండించిన కాఫీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి నిలయమైన భారత పార్లమెంట్‌లో ఎంపీలు అందరినీ అమోఘమైన రుచితో మైమరపిస్తోందన్నారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ధ్యేయం."

## మీ సమస్య - మా పరిష్కారం" కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రజల వినతులను పరిష్కరిస్తాం

### రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు మార్చి 28 :- 'మీ సమస్య - మా పరిష్కారం' కార్యక్రమం ద్వారా కర్నూలు నియోజకవర్గంలోని ప్రజల వినతులను పరిష్కరిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక మౌర్య హోటల్ లోని శ్రీ ఆర్య ఫంక్షన్ హాల్ లో కర్నూలు నియోజకవర్గం లో ని ప్రజల సమస్యల పరిష్కారం కొరకు "మీ సమస్య - మా పరిష్కారం"అనే కార్యక్రమం ను ప్రారంభించి అనంతరం ప్రజల నుండి వచ్చిన వినతులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గారు,జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ కర్నూలు నియోజకవర్గం లోని ప్రజలు సమర్పించిన వినతులను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు 9 నెలలు దాటిందని, కర్నూలులో ఉండే సమయంలో ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు నియోజకవర్గంలోని ప్రజల నుండి వచ్చే వినతులను స్వీకరించి పరిష్కరిస్తున్నామని అయితే గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు ప్రజల నుంచి వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ఈరోజు నూతనంగా "మీ సమస్య - మా పరిష్కారం" అనే కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులను స్వీకరించి అధికారుల సమక్షంలోనే సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈరోజు కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి, మున్సిపల్ శాఖ కు సంబంధించినవి, పింఛన్లకు సంబంధించిన విన్నతులు వచ్చాయని తక్షణమే పరిష్కరించాలని ఇప్పుడు వచ్చిన వినతులు మరల పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు కూడా వినతులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సి వెంకటనారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టౌన్ డిఎస్పి బాబు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరుస ఎదురుదెబ్బలతో వంశీ ఉక్కిరిబిక్కిరి

విజయవాడ, మార్చి 28: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి మరోసారి భారీ షాక్ తగిలింది. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీకి చుక్కెదురైంది. ఈ కేసులో వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఎస్సీ ఎస్టీ కోర్టు డిస్మిస్ చేసింది. ఈ సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రాసుక్యూషన్ తరపు వాదనలను తాము పరిగణనలోకి తీసుకోలేదని



తెలిపింది. అలాగే సత్య వర్ధన్ కిడ్నాప్ కేసులో ఐఓకు, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ న్యాయస్థానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బెయిల్ పిటిషన్ వాదనల సందర్భంగా కోర్టును ధిక్కరించేలా వ్యవహరించారని ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం వెల్లడించింది.కాగా.. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్ట్ అయిన వంశీ ప్రస్తుతం విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ వేశారు. మూడు విడుతలుగా ఇరువర్గాల వాదనలు విన్న న్యాయాధికారి బెయిల్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలను ఆర్డర్‌లో పొందుపర్చారు న్యాయాధికారి. వంశీ బెయిల్ పిటిషన్‌కు సంబంధించి వాదనల సమయంలో విచారణాధికారి, ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన సమయంలో కొన్ని అభ్యంతరాలను లేవత్తుతూ కోర్టు సమయాన్ని వృధా చేశారని న్యాయాధికారి అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కొన్ని అనవసర వ్యాఖ్యలు చేసినట్లు అభిప్రాయపడుతూ ఐఓ, ప్రాసిక్యూషన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పొందుపర్చారు.ఇదిలా ఉండగా... టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌ను సీఐడీ కోర్టు కూడా డిస్మిస్ చేసిన విషయం తెలిసిందే. వంశీతో పాటు మరో నలుగురు నిందితులకు కూడా బెయిల్ ఇచ్చేది లేదని కోర్టు స్పష్టం చేసింది. అలాగే ఈరోజు సత్యవర్ధన్ కేసులో కూడా ఎస్సీ ఎస్టీ కోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో వంశీ మరికొన్ని రోజులు జైలులోని ఉండే పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా టీడీసీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ రిమాండ్ ముగియడంతో నేటి ఉదయం జిల్లా జైలు నుంచి నేరుగా కోర్టుకు తీసుకెళ్లారు గన్నవరం పోలీసులు. వంశీతో పాటు లక్ష్మీపతిని కూడా కోర్టు హాజరుపర్చారు. ఈ కేసులో రిమాండ్‌ను ఏప్రిల్ 9 వరకు పొడిగిస్తూ సీఐడీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రెండు కోర్టుల్లోనూ బెయిల్ పిటిషన్లు డిస్మిస్ కావడంతో వంశీ ఇక హైకోర్టులోనే పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంటుంది.

## రుజువు చేస్తే చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తా : అంబటి రాంబాబు

అమరావతి : పోలవరం ప్రాజెక్టు పై ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై అన్ని అబద్దాలే మాట్లాడుతున్నారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గురువారం ఏపీ సీఎం పోలవరం ప్రాజెక్టును సందర్శించి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనపై విరుచుకు పడ్డారు. ఈ సందర్భంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను రాంబాబు తిప్పికొట్టారు.పోలవరం నిధులు ప్రభుత్వానికి మళ్లించినట్లు రుజువు చేస్తే చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తానని అన్నారు. పోలవరాన్ని సర్వనాశనం చేసింది చంద్రబాబుయేనని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో పోలవరం పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగాయని వెల్లడించారు.అబద్దాలు చెప్పటంలో అందరికన్నా పెద్దవాడు, నిజాలు చెప్పటంలో అందరికన్నా చిన్నవాడు చంద్రబాబేనని ఎద్దేవా చేశారు. పోలవరం నిర్మాణం సమయంలో రాష్ట్ర ప్రభుత్వమే పోలవరానికి ముందుగా డబ్బులు ఖర్చు పెట్టిన తరువాత కేంద్రం రీయింబర్ చేయడానికి కేంద్రంతో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఇందులో డబ్బుల మళ్లింపు ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు.

# థాయ్‌లాండ్, శ్రీలంకలో మోదీ పర్యటన ఖరారు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ థాయ్‌లాండ్ , శ్రీలంక పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఏప్రిల్ 3 నుంచి 6 తేదీ వరకూ ఆయన పర్యటను ఉంటుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. థాయ్‌లాండ్ ప్రధానమంత్రి పేటోంగ్టార్ల్ ఆహ్వానం మేరకు థాయ్‌లాండ్ వెళ్తున్న మోదీ.. ఏప్రిల్ 3,4 తేదీల్లో బ్యాంకాక్‌లో జరిగే 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషిటేయటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్' సదస్సులో పాల్గొంటారు. కొత్తగా ప్రకటించిన "మహాసాగర్ పాలసీ" కింద ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించాలనే భారత్ విజన్‌కు అనుగుణంగా పీఎం పర్యటన సాగనుంది.ప్రధాన మంత్రి థాయ్‌లాండ్‌లో పర్యటించనుండటం ఇది మూడోసారని



కేంద్ర విదేశాంగ శాఖ (ఎంఈఏ) తెలిపింది. థాయ్‌లాండ్, శ్రీలంకలో ప్రధాని పర్యటించనుండటం, 6వ బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొనడం ద్వారా ఫస్ట్ నైబర్‌హుడ్ పాలసీ, యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్, ఇండో-పసిఫిక్ విజన్‌లపై భారత్‌కు ఉన్న కమిట్‌మెంట్‌ను చాటుతుందని పేర్కొంది.బిమ్‌స్టెక్ కూటమిలో ఇండియాతో పాటు శ్రీలంక, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, భూటాన్ దేశాలు ఉన్నాయి.2018లో ఖాట్మండులో 4వ బిమ్‌స్టెక్ సదస్సు తర్వాత బిమ్‌స్టెక్ నేతలంతా ముఖాముఖి కలుసుకోనుండటం ఇదే మొదటిసారి. 5వ బిమ్‌స్టెక్ సమావేశం కొలంబోలో మార్చి 22న వర్చువల్ తరహాలో జరిగింది. ఈసారి జరిగే సమావేశంలో ప్రాంతీయ సహకారం, భాగస్వామ్యం బలోపేతం, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ఆహారం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై దేశాధినేతలు చర్చించన్నరు. పేటోంగ్టార్న్‌తో మోదీ సమావేశంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం, వాణిజ్యం వంటి అంశాలను ప్రధానంగా చర్చించనున్నారు. శ్రీలంక పర్యటనలో భాగంగా దేశాధ్యక్షుడు అనురకుమార దిశనాయకేను ప్రధాని మోదీ కలుస్తారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ఉభయనేతలు చర్చలు జరుపుతారని, పలు ఒప్పందాలపై సంతకాలు జరుగుతాయని విదేశాంగ శాఖ తెలిపింది.

# భారత్‌లోనూ భూప్రకంపనలు..

## భయంతో జనాల పరుగులు



న్యూఢిల్లీ: ప్రకృతి విలయాలు మిగిల్చే విషాదం అంతా ఇంతా కాదు. వీటి కారణంగా సొంత వాళ్లను కోల్పోయి రోడ్డున పడ్డ వారెందరో. ప్రాణ నష్టంతో పాటు భారీ స్థాయిలో ఆస్తి, ధన నష్టం కూడా వాటిల్లుతుంది. అందుకే భూకంపాలు, సునామీలు లాంటి ప్రకృతి విలయాల మాట ఎత్తితే సాధారణ ప్రజలతో పాటు ప్రభుత్వాలు కూడా భయపడతాయి. ఇప్పుడు ఒకేసారి ఐదారు దేశాల ప్రజల్ని భూకంపాలు వణికేలా చేస్తున్నాయి. భారత్‌తో పాటు మయన్మార్, థాయ్‌లాండ్, చైనా లాంటి దేశాల్లో వరుస భూకంపాలు భయపెడుతున్నాయి. మన దేశంలో మేఘాలయ, ఇంఫాల్‌లో ఒక్కసారిగా భూప్రకంపనలు రావడంతో జనాలు భయంతో రోడ్ల మీదకు పరుగులు తీశారు.తొలుత మయన్మార్‌లో భూకంపం సంభవించింది. నిమిషాల వ్యవధిలో రెండుసార్లు భూమి కంపించడంతో వందల సంఖ్యలో భవనాలు కూలిపోయాయి. వాటి కింద వేలాది మంది చిక్కుకున్నారని సమాచారం. మండేల్‌లోని చారిత్రక అవా బ్రిడ్జి నేలమట్టమైంది. ఒక భవనంలోనైతే 43 మంది వరకు గల్లంతు అయినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత థాయ్‌లాండ్‌లో భూప్రకంపనలు మొదలయ్యాయి. దీంతో బ్యాంకాక్‌లోని భవనాలను ఖాళీ చేయిస్తున్నారు అధికారులు. అక్కడి ప్రధాని ఎమర్జెన్సీ ప్రకటించారు. రైల్వేతో పాటు విమాన సర్వీసులను వెంటనే నిలిపివేశారు. ఈ భూప్రకంపనల ఎఫెక్ట్ కాస్తా ఇండియాకు పాకింది. మన దేశంలోని మణిపూర్, మేఘాలయలో భూమి కంపించడంతో వేలాది మంది ప్రజలు రోడ్ల మీదకు పరుగులు పెట్టారు. కోల్‌కతా, ఢిల్లీలోనూ భూమి కంపించింది. మేఘాలయలో భూకంప తీవ్రత 4.0గా నమోదైంది.

# 11ఏళ్ల టెక్ పిడుగు అఖిల్‌కు మంత్రి లోకేష్ అభినందనలు



అమరావతి, మార్చి 28: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను 11 ఏళ్ల టెక్ పిడుగు అఖిల్ ఆకెళ్ల కలిశారు. ఈ సందర్భంగా టెక్నాలజీలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్న అఖిల్‌ను మంత్రి అభినందించారు. ఉదయం ఉండవల్లిలోని నివాసంలో తన తండ్రితో కలిసి మంత్రి లోకేష్‌ను అఖిల్ కలుసుకున్నారు. 11 ఏళ్ల అఖిల్ యూకేలో విద్యను అభ్యసిస్తున్నారు. చిన్న వయసులోనే టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నాడు అఖిల్. ఈ రంగంలో ఎన్నో మైలురాళ్లను సాధించాడు.అఖిల్‌కు మైక్రోసాఫ్ట్ ధృవీకరించిన అజ్యూర్, డేటా, సెక్యూరిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఫౌండేషన్ కోర్సుల్లో సర్టిఫికేషను పొందారు. యూకేలో నిర్వహించిన పలు టెక్ సమ్మిట్‌లలో చిన్నారి పాల్గొన్నారు. అమరావతిలో జరుగనున్న సమాచార, సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు అఖిల్ ఆసక్తి కనబర్చడంతో త్వరలోనే కలుస్తానని గతంలో మంత్రి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అఖిల్‌ను కలిసిన మంత్రి.. టెక్నాలజీలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నందుకు చిన్నారిని అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్.. డీఏ 2 శాతం పెంపుకు కేబినెట్ ఆమోదం

కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు

# సంపాదకీయం

శనివారం 29-03-2025


## కశ్మీర్ కనుమరుగేనా

భారతదేశానికి తలమానికగా ఉన్న కశ్మీర్ త్వరలోనే కనుమరుగు అవుతుందా..? అక్కడి వాతావరణం చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. కశ్మీర్ కింద భూమి అపాయం అంచులో కొట్టుమిట్టాడుతోంది. కాలం గడుస్తున్న కొద్దీ.. కశ్మీర్‌లో పరిస్థితులు ఏవీ కలిసిరావడం లేదు. రాజకీయం, పర్యావరణం.. ఏదీ కశ్మీర్‌ను కాపాడే కండీషన్‌లో లేవు. ఒకవైపు అభివృద్ధి పేరుతో పర్యావరణం పాడైపోతుంటే.. మరోవైపు, భూమిపై పెరుగుతున్న వాతావరణ మార్పు కశ్మీర్ ఊపిరిని స్లోగా మింగేస్తుంది. వెరసి, చల్లని ప్రదేశం కాస్తా సెగలు కక్కుతోంది. కశ్మీర్‌ని చూడని వాళ్లు ఎవరైనా ఉంటే.. త్వరగా వెళ్లి చూసేయండి. ఎందుకంటే, ఇంకొన్ని సంవత్సరాల్లో కశ్మీర్ ఇప్పుడు అనుకుంటున్నంత అద్భుతంగా ఉండకపోవచ్చు. అందమైన మంచు అంతా కరిగిపోయి.. మనం రెగ్యులర్‌గా చూసే కొండలా రాళ్లు రప్పలు మట్టితోనే కనిపించొచ్చు. ఇంకా లేదంటే.. అసలు కొండలన్నీ కూలిపోయి, అల్లకల్లోలంగా మారొచ్చు. పచ్చని భూమి, రహదారులు, వంతెనలన్నీ కుంగిపోయి భారీ గోతులే మిగలొచ్చు. విపరీతమైన భూకంపాలు, దారుణమైన ఉప్పెనలతో కశ్మీర్ కళ తప్పి పోవచ్చుఅవును.. వినడానికి చాలా కష్టంగా ఉన్నా.. జమ్మూ కశ్మీర్ భూమి కింద పెద్ద అపాయం దాగుంది. స్లో పాయిజన్‌లా అది ఆ ప్రాంతంలో భూమి బలాన్ని నీరుగారుస్తుంది. ఫలితంగా.. ఇంకొన్ని సంవత్సరాల్లో జమ్మూ కశ్మీర్, లడఖ్‌లో భూమి ద్రవంగా మారి, కుంగిపోయే ప్రమాదం ఉంది. కశ్మీర్ హిమాలయాల్లో శాశ్వతంగా పరుచుకున్న మంచు ప్రస్తుతం సాధారణం కంటే అత్యంత ఎక్కువగా కరగడం మొదలయ్యింది. ఇది ఒక ప్రత్యేకమైన పర్యావరణ ముప్పుగా మారుతుందని ఇటీవలి అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.అందంగా పరుచుకున్న ఈ శాశ్వత మంచు కరిగిపోవడం వల్ల.. పర్వత ప్రాంతంలోని 193 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్లు.. 2 వేల 415 గృహాలు.. 903 ఆల్పైన్ సరస్సులు.. 8 జలవిద్యుత్ ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉందని ఒక కొత్త అధ్యయనంలో పరిశోధకులు కనుక్కున్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని భూమి కింద కనీసం రెండు సంవత్సరాలుగా నిరంతరం ఘనీభవించిన నేల, అవక్షేపాలు, రాతి మొదలైన వాటితో ఏర్పడిన పెర్మాఫ్రాస్ట్ ఉంది. మంచు గడ్డలా ఘనీభవించిన ఈ భూమిపైన శాశ్వతంగా మంచు కప్పబడి ఉంటుంది. ఈ మంచులో ఎక్కువ భాగం అనేక సహస్రాబ్దాలుగా అలాగే ఉంది.అయితే, ఈ అధ్యయనంలో భాగంగా.. 2002 నుండి 2023 వరకు ఉపరితల ఉష్ణోగ్రతల ఎలా ఉన్నాయో తెలుసుకోడానికి ఉపగ్రహ డేటాను విశ్లేషించగా ఈ విషయం వెల్లడయ్యింది. 21 సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరానికి 56కి పైగా చిత్రాలను పరిశీలించారు పరిశోధకులు. మొత్తం 11 వందల 76 భూ ఉపరితల ఉష్ణోగ్రత చిత్రాల డేటాసెట్ ద్వారా ఒక అంచనాకు వచ్చారు. ఈ డేటా మోడిస్ అని పిలిచే టెర్రా, ఆక్వా ఉపగ్రహాలపై ఉన్న నాసా సెన్సార్ నుండి సేకరించింది. అయితే, ఈ చిత్రాల్లో ప్రతి పిక్సెల్ 1 చదరపు కిలో మీటర్ల వైశాల్యాన్ని చూపిస్తుంది. ఈ ప్రకారం.. జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లోని సుమారు 222,236 పిక్సెల్‌లను విశ్లేషించారు.సాధారణంగా చెట్లు ఎక్కువగా ఉండటం వల్ల సూర్య కిరణాలు శాశ్వత మంచుపై పడి, దాన్ని కరిగించకుండా రక్షిస్తాయి. అలాగే, భూకంపాల వంటి సహజ ప్రక్రియలను నియంత్రిస్తాయి. అయితే, అభివృద్ధి పేరుతో భారీగా ఆనకట్టల నిర్మాణం, రోడ్లు వేయడం, కొండలను తొలుస్తూ టన్నెల్స్ నిర్మించడం, ఈ ప్రాంతంలో భారీగా పెరిగిన పర్యాటకం.. ముఖ్యంగా, 370 రద్దు తర్వాత పెరిగిన రియల్ ఎస్టేట్.. వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా పశ్చిమ హిమాలయాలు ప్రమాదంలో పడినట్లు తెలుస్తోంది. కశ్మీర్ నేలపై ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ ఆ ప్రాంతంలోని శాశ్వత మంచు స్థిరత్వం ప్రశ్నార్థకంగా మారిందని అధ్యయనాలు చెబుతున్నాయి.ఇక, సిక్కింలోని దక్షిణ లోనాక్ సరస్సు, అక్టోబర్ 2023లో ఇలాంటి పరిస్థితులలోనే భారీ నాన్-ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్‌ని ఎదుర్కొంది. సరస్సు మట్టు శాశ్వత మంచుతో నిండిన పదార్థంతో కూడిన మొరైన్‌లు ఉన్నాయి. కాలక్రమేణా, ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు క్షీణించిన ఈ శాశ్వత మంచు వల్ల కొండవాలు పూర్తిగా కూలిపోయింది. ఇలా శాశ్వత మంచు క్షీణత వల్ల భూగర్భ జలాలు, నది నీటి లభ్యత కూడా ప్రతికూల ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది. ఇక, రాతి హిమానీనదాల రూపంలో శాశ్వత మంచు, నది ప్రవాహానికి దోహదం చేస్తుంది.కొన్ని ప్రాంతాల్లో అయితే, దాని క్షీణత నదుల మూల ప్రవాహాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అయితే, భారతదేశంలో ఈ ప్రభావాలను ఖచ్చితంగా గుర్తించడానికి సమగ్ర అధ్యయనాలు ఇప్పటి వరకూ జరగలేదు. కాబట్టి, ఈ విషయంపై ఖచ్చితమైన ప్రకటనలు ఇప్పుడప్పుడే చేయలేమన్నది పరిశోధకుల అభిప్రాయం. అయితే, ఒక్కటి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. శాశ్వత మంచుకు వస్తున్న ఈ నష్టం వల్ల కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని తెలుస్తోంది.ఈ శాశ్వత మంచును పరిరక్షించడం కోసం ఇప్పటికే ప్లాన్ చేసిన రోడ్లను ఆపకపోయినప్పటికీ.. భవిష్యత్‌లో ప్లాన్ చేసే నిర్మాణాలను శాశ్వత మంచు ఉన్న ప్రదేశాల్లో నిర్మించకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, పర్యావరణ పరంగా పెలుసుగా ఉండే ప్రాంతాల్లో స్థిరమైన నిర్మాణాలు చేపట్టకపోవడం మంచిదని అంటున్నారు. ఇక, జలవిద్యుత్ విద్యుత్ ప్రాజెక్టుల వంటి భారీ ప్రాజెక్టులకు పర్యావరణ ప్రభావాలు ఎలా ఉంటాయనే అంచనాలు వేస్తున్నప్పటికీ.. అవి నాన్-ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్‌కి, ఇతర క్రయోస్పెరిక్ ప్రమాదాలను తెస్తాయా లేదా అనేది కూడా పరిశీలించాలనే సూచనలు ఉన్నాయి. ఎందుకంటే, గతంలో జరిగిన పెద్ద విపత్తుల తర్వాతే ఈ శాశ్వత మంచు సంబంధిత ప్రమాదాల గురించి అవగాహన పెరిగింది. గతంలో, నాన్-ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్‌లు ప్రధానంగా నేపాల్‌లో సంభవించేవి.

## స్కానింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



కర్నూలు జిల్లా వైద్యమరియు ఆరోగ్యశాఖాధికారి ఆదేశాలమేరకు జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్.రఘు కర్నూల్ నగరంలోని లోటస్,సన్ రైజ్ అల్ట్రాసౌండ్ అనంతరం స్కానింగ్ సెంటర్లలో మిషన్లు రిజిస్టర్ లో నమోదు, వాటి వరుస సంఖ్య, తయారీ కంపెనీ ల పేర్లను సరిపోల్చి చూశారు,వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలకు అనుగుణంగా స్కానింగ్ నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు, స్కానింగ్ సెంటర్ల తనిఖీలో భాగంగా లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని తెలిపారు,స్కానింగ్ చేసే ప్రతి గర్భిణీ యొక్క వివరాలను ఫారం ఎఫ్ లో ఇంటి పేరుతో రాయాలని ,మొదటి కాన్పు ,రెండవ కాన్పు ఆడ,మగ ,వయసు, రాయాలని అన్నారు. ఫారం ఎఫ్ లు ప్రతి నెల 5 వ తేదీ లోపు ఆన్ లైన్ లో పొందుపరచాలని తెలిపారు, స్కానింగ్ నివేదికలను రెండు సంవత్సరములు వరకు భద్రపరచుకోవాలని తెలిపారు, స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసే సహాయ సిబ్బంది విద్యార్హతలు పరిశీలించినారు.పిసిపిఎన్‌డిటి యాక్ట్ కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని,ఇప్పటికే రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారు కాలపరిమితి లోపల రెన్యూవల్ చేయించాలని తెలిపారుఆసుపత్రిలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమనే పోస్టర్ ను కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమములో సంబంధిత ప్రైవేటు నర్సింగ్ హోం యజమానులు మరియు ప్రోజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



## నంద్యాలలో మలబార్ గోల్డ్ డైమండ్ షోరూం ప్రారంభం.

### భారతదేశంలోనే అతిపెద్ద బంగారు ఆభరణాల షోరూం..

### న్యాయశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫారుక్



వ్యాపారిగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ డైమండ్ ఇండియా లోనే కాకుండా ఇతర దేశాల్లో కూడా ఆభరణాల షోరూమ్ ఉ ందన్నారు. విభిన్నమైన రకరకాల డిజైన్లతో కూడిన ఆభరణాలు ప్రారంభోత్సవం సందర్భంగా నంద్యాల సిటీ భారతదేశంలోనే అతిపెద్ద బంగారు ఆభరణాల షోరూమ్ గా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ ప్రఖ్యాత గాంచిందని రాష్ట్ర మైనార్టీ న్యాయశాఖ మంత్రి ఎన్ ఎండి ఫారుక్ అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్ నందు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫారుక్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ని నంద్యాల ప్రాంతంలో మలబార్ గోల్ట్ 18వ షోరూం ప్రారంభించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. బాధ్యతయుతమైన ఆభరణాల



ఆఫర్లు వర్తించేలా నంద్యాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ సందర్భంగా వచ్చే నెల ఏప్రిల్ ఆరవ తేదీ ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు ఇండియా మేనేజర్ పేర్కొన్నారు. వినియోగదారులు చేసిన ప్రతి కొనుగోలుపై బంగారు బరువుకు సరి సమానమైన వెండి నాణ్యం ఉచితంగా అందుకుంటారని తెలిపారు. అసాధారణమైన హస్తకళలను మరియు అసమాన సేవలను అందిస్తూ భారతదేశంలో తమ ఉనికిని మరింత విస్తరించాలనే మలబార్ ప్రణాళికలకు అనుగుణంగా ప్రారంభించబడినది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్ ఎండి ఫయాజ్, మేనేజ్మెంట్ మరియు టీం సభ్యులు రిటైల్ హెడ్ రెస్ట్ ఆఫ్ ఇండియా సిరాజ్, నిఖిల్, చంద్రాస్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు

## వైసిపి నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### జన సేన పార్టీ ఆలూరు ఇంచార్జీ వెంకప్ప

ఆలూరు జనసేన ఐటీ సెల్ ఇంచార్జ్ రంజిత్ స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతు గ్రామాల అభివృద్ధికి వైసిపి సర్పంచ్ ఎంపీటీలు అడ్డంకిగా మారితే సహించ బోమని ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వెంకప్ప అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రూ. 40 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధికి సహకరించకపోతే సర్పంచ్ ల చెక్ పవర్ రద్దు చేయిస్తామని హెచ్చరించారు. త్రాగు నీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు కేటాయింపు కోసం ఇటీవల ఓర్వకల్ వచ్చిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆరంభానికి కూడా సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలో రూ. 2 కోట్ల తో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందన్నారు.. ఇప్పటికే పల్లె పండుగ నిద్ర ద్వారా గ్రామంలో సిసి రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణం కూడా పూర్తయింది అన్నారు.ఎన్ డి ఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు...సమావేశం లో నాయకులు ఛత్రపతి,శేఖర్,భాషమున్న,



## మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు 40 గంటల శిక్షణ": మరియు ముగింపు సమావేశం:"



కడపఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి మరియు మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఆదేశానుసారంగా గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప జి శ్రీదేవి మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్. బాబా ఫక్రుద్దీన్ వారు న్యాయ సేవా సదన్ కడప నందు ఐదవ రోజు అయిన 28-03-2025 వ తేదిన"మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు 40 గంటల శిక్షణ" కార్యక్రమము న్యాయవాదులతో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా రోల్ ప్లే -ఎ.ఎ మోహన్ వర్సెస్ సాఫ్ట్ డ్రింక్, న్యాయపరమైన మధ్యవర్తుల కోసం నైతిక సూత్రాలు, న్యాయవాది మధ్యవర్తుల కోసం నైతిక సూత్రాలు, డాక్యుమెంటరీ, ఇంటరాక్టివ్ సెషన్ / ముగింపు వ్యాఖ్యలు మొదలగు వాటిని వివరించారు. అనంతరం కడప మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ ఎల్ వెంకటేశ్వరరావు మరియు కడప సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు మార్చి 24వ తేదీ నుండి మార్చి 28వ తేదీ వరకు (5 రోజులు) మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులకు ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో పీజీ సురేష్, రిసోర్స్ పర్సన్/ట్రైనర్, కేరళ, జి జ్యోతి, రిసోర్స్ పర్సన్/ట్రైనర్, కేరళ మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

## మలబార్ గోల్డ్ & డైమండ్స్ షోరూంను ప్రారంభించిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్





విభారె న్యూస్ మార్చి 28 నంద్యాల ప్రతినిధి -నంద్యాల స్థానిక శ్రీనివాస్ సెంటర్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ & డైమండ్స్ షోరూమును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఆభరణాల వ్యాపారిగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ & డైమండ్స్, తమ కొత్త షోరూమును నంద్యాల శ్రీనివాస్ నగర్ లో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు . 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ కొత్త షోరూమ్, విభిన్న డిజైన్లు మరియు శైలులతో తయారుచేసిన అద్భుతమైన ఆభరణాల సేకరణను అందిస్తూ, వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయి షాపింగ్ అనుభూతిని అందిస్తుందని . ఈ శుభసందర్భంగా, 06వ ఏప్రిల్ 2025 తేదీ వరకు, ప్రత్యేక ఆఫర్లు అందిస్తుందని , వినియోగదారులు చేసిన ప్రతి కొనుగోలుపై, బంగారం బరువుకు సరిసమానమైన వెండి నాణెం ఉచితంగా అందుకుంటారన్నారు (షరతులు వర్తిస్తాయన్నారు). భారతదేశంలో తమ ఉనికిని మరింత విస్తరించాలనే మలబార్ ప్రణాళికలకు అనుగుణంగా ప్రారంభించబడిన ఈ కొత్త షోరూమ్, తమ ప్రస్థానంలో మరొక ముందడుగును వేసిందన్నారు. నంద్యాలలో ప్రారంభించిన ఈ షోరూమ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మలబార్ బ్రాండ్ యొక్క 18 వ అవుట్లెట్, మరియు ఈ ప్రాంతంలో మలబార్ ఉనికిని మరియు నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందనే మంత్రి ఫరూక్ తెలిపారు . అనంతరం వినియోగదారులు కొనుగోలు చేసిన బంగారు ఆభరణాలను మంత్రి ఫరూక్ గారి చేతుల మీదుగా కొనుగోలుదారులకు అందించడం జరిగిందిఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , మేనేజ్మెంట్ & టీమ్ సభ్యులు, శ్రీ సిరాజ్ పికె , రిటైల్ హెడ్ రెస్ట్ ఆఫ్ ఇండియా మలబార్ గోల్డ్ & డైమండ్స్ నిఖిల్ చంద్రన్ , ఆంధ్రప్రదేశ్ జోనల్ హెడ్ మలబార్ గోల్డ్ & డైమండ్స్ ఫయిజ్ , మలబార్ గోల్డ్ & డైమండ్స్ కర్నూల్ షోరూం హెడ్ మాయాజ్ , మలబార్ గోల్డ్ & డైమండ్స్ నంద్యాల షోరూం హెడ్ వినియోగదారులు మరియు శ్రేయోభిలాషులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా పిఠాపురం




కాకినాడ, మార్చి 28, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. అన్నీ తెలిసి మౌనంగా ఉంటున్నారా? లేక వాటంతట అవే సర్దుకుంటాయని భావిస్తున్నారో తెలియదు కానీ పవన్ కల్యాణ్ మౌనం మాత్రం పిఠాపురం టీడీపీ నేతలకు ఎక్కడో కాలుతున్నట్లే కనపడుతుంది. వరసగా జరుగుతున్న ఘటనలు చూస్తుంటే పవన్ కల్యాణ్ కు అన్నీ తెలిసి జరుగుతున్నాయని అనుకోవాలని తెలుగు తమ్ముళ్లు భావిస్తుంటే, పవన్ వస్తే అంతా సెట్ రైట్ అవతుందని జనసైనికులు చెబుతున్నారు. అసలు పిఠాపురం నియోజకవర్గాన్ని ఎందుకు జనసేన నేతలు ఇంత కాంట్రవర్సీతో కొని తెచ్చుకుంటున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభకు ముందు నుంచే టీడీపీ, జనసేనల మధ్య వార్ ప్రారంభమయినట్లు కనిపిస్తుంది. ఎలాగంటే మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ పిఠాపురం అంటే పవన్ కల్యాణ్ అడ్డా అని అనడం, అక్కడ మరో నేతకు అవకాశం లేదని చెప్పడం వివాదంగా మారింది. నాదెండ్ల మనోహర్ అలాంటి వ్యాఖ్యలు చేశారంటే పవన్ కల్యాణ్ కు తెలియకుండా చేశారని అనుకోలేం. అందులో పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఏం మాట్లాడినా జనసేన నేతలు ఆచితూచి మాట్లాడతారు. నాదెండ్ల మనోహర్ పవన్ కల్యాణ్ అడ్డా పిఠాపురం అనడంతో వర్మతో పాటు అనేక మంది టీడీపీ నేతలకు కొంత ఇబ్బందికరంగా మారింది. తర్వాత ఆవిర్భావ సభలోనూ నాగబాబు చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యాన్ని పోశాయి. పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపునకు పవన్ ఒక కారణమయితే, జనసేన క్యాడర్ మరో కారణమని, ఎవరైనా తామే పవన్ విజయానికి కారణమని భావిస్తే వారి ఖర్మ అని చేసిన వ్యాఖ్యలు వర్మతో పాటు టీడీపీ స్థానిక నేతల్లో గునపాలు దిగినట్లయింది. దీంతో పాటు అదే సభలో పవన్ కల్యాణ్ కూడా టీడీపీని అధికారంలోకి తెచ్చామని చెప్పి మరింత వివాదానికి తావిచ్చారు. అప్పటి నుంచి పిఠాపురం నియోజకవర్గంలో ఇటు టీడీపీ, అటు జనసేన నేతలు, క్యాడర్ మధ్య పొసగడం లేదన్నది యదార్ధం. కానీ రెండు పార్టీల అగ్రనేతలు పిఠాపురం లో జరుగుతున్నవిషయాలను పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ ముదురుతున్నాయి. తాజాగా పిఠాపురం జనసేన ఇన్ ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని టీడీపీ క్యాడర్ అడ్డుకుంది. నియోజకవర్గంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం సందర్భంగా ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. తమ నేత వర్మకు ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందకపోవడం వల్లనే టీడీపీ శ్రేణులు బరస్ట్ అయ్యారంటున్నారు. ఇలా పిఠాపురంలో రెండు పార్టీల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుంది. కానీ పవన్ కల్యాణ్ మాత్రం విభేదాలను మాపే ప్రయత్నం చేయకపోవడం కూడా టీడీపీ నేతలకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తుంది. ఇంత జరుగుతున్నా తమ పార్టీ నేతలకు, క్యాడర్ కు సర్దిచెప్పాల్సిన పవన్ మౌనం పాటించడం వెనక వర్మను సైడ్ చేయాలన్న లక్ష్యమే కనిపిస్తుందన్న అభిప్రాయం పిఠాపురం టీడీపీ నేతల్లో మరింత బలపడుతుంది. మరి ఈ వివాదం ఎటు దారి తీస్తుందన్నది చూడాలి.పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని, మౌలిక వసతుల కల్పన విషయంలో చురుగ్గా వ్యవహరించాలని అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. పిఠాపురం నియోజక వర్గంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పాడా) డైరెక్టర్ పర్యటించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. తమ పర్యటన వివరాలను ఉప ముఖ్యమంత్రికి తెలియచేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో చేపడుతున్న రహదారి పనులు, ఉపాధి హామీ కార్యక్రమాల అమలుపై పురోగతి నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని గ్రామాలు, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ వేసవి సమయంలో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయాలు ఉండకూడదని, సమ్మర్ స్టోరేజి ట్యాంక్స్ దగ్గర తనిఖీలు చేయాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా నిధులు సమకూరుస్తున్నాము. వాటిని సద్వినియోగం చేసి ప్రజలకు మేలు చేసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పవన్ తెలిపారు. అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతి వారం ఈ పనులపై సమీక్ష చేపడతాను. అధికారులు క్షేత్ర స్థాయి పురోగతిని నిశితంగా పరిశీలించాలి. పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తన కార్యాలయ దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ పని చేస్తోందని.. విద్యుత్ అంతరాయ సమస్య ఉందని తెలియగానే టిడ్కో గృహాల దగ్గర రూ.3 కోట్లతో 5 ఎం.వి.ఎ సామర్థ్యంతో కొత్త సబ్ స్టేషన్ పనులు చేపట్టామన్నారు. అమృత్ 2.0 ద్వారా పిఠాపురం పట్టణంలో తాగు నీటి సమస్యలు పరిష్కరించేందుకు ఇప్పటికే పురపాలక శాఖ అధికారులతో సమీక్ష చేశామని పిఠాపురం ? ఉప్పాడ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపగలిగామన్నారు. రూ.59.7 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో రూ.40.2 కోట్లతో 444 రోడ్డు పనులు చేపట్టాము. అదే విధంగా 431 గోకులాలు పిఠాపురం నియోజకవర్గానికి ఇచ్చాము. పిఠాపురంలో ప్రభుత్వ ఆసుపత్రిని సి.హెచ్.సి. నుంచి ఏరియా ఆసుపత్రి స్థాయికి పెంచాము. అందుకు అనుగుణంగా రూ.38.32 కోట్లు నిధులు వచ్చాయి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ ఏ విధంగా చూపుతుందో తెలిపేందుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారి నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుస్తోంది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మార్గదర్శకత్వంలో వాటిని సద్వినియోగపరుస్తున్నాము. ఈ క్రమంలో అధికారులు, ఉద్యోగులు సానుకూల దృక్పథంతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల అంశంపై ప్రత్యేక సూచనలు చేశారు. పిఠాపురం నియోజక వర్గ పరిధిలో పోలీసింగ్ వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఊటంకిస్తూ, నాలుగు పోలీస్ స్టేషన్లలో ఉన్న పరిస్థితిపై ఇంటెలిజెన్స్ నివేదిక తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవినీతికి పాల్పడుతున్న పోలీసు అధికారుల మూలంగా శాఖ చులకన అవుతోందన్నారు. ప్రజలను ఇబ్బందిపెట్టే నేరస్తులనే కాదు, వారికి అండగా ఉండే నాయకులను, పోలీసులను కూడా ఉపేక్షించకూడదన్నారు. తన దృష్టికి వచ్చిన కొన్ని అంశాలను వివరించి వాటిని సత్వరమే జిల్లా పోలీసు అధికారులకు తెలియచేయాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు.

# ఇలా అయితే ఎలా..

## తమ్ముళ్ల మధనం

విజయవాడ, మార్చి 28, నాటి ప్రభుత్వంలో వైఎస్ జగన్ నా ఎస్.సిలు, నా బీసీలు, నాఎస్టీలంటూ ప్రతి చోట నినాదాలు చేసేవారు. పేదరికంతో సంబంధం లేకుండా జగన్ నాడు తీసుకున్న కొన్ని నిర్ణయాలతో మిగిలిన వర్గాలు దూరమయ్యాయి. ప్రధానంగా రెడ్డి సామాజికవర్గంతో పాటు అగ్రకులాలన్నీ దూరం కాగా, నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలన్నవారు కూడా జగన్ కు చేరువ కాలేదు. ఫలితంగా మొన్నటి ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. అన్ని వర్గాలను కలుపుకుని పోతూ, పేదరికంలో కులాలు, మతాలు చూడకుండా ఉండాలన్నది అందరి ఆలోచన. అలా చేయకపోబట్టే జగన్ తాను ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా గెలుపును అందుకోలేకపోయారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు కూడా అదే తరహా రాజకీయాలు చేయడమేంటని టీడీపీలోని సోషల్ మీడియాలోనే ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలతో కొన్ని వర్గాలు దూరమయ్యే అవకాశముందన్న హెచ్చరికలు వినపడుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు, నేతలు కూడా చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోస్టులు పెడుతున్నారంటే అందుకు జాగ్రత్తలు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. లేకుంటే జగన్ కు పట్టిన గతే టీడీపీకి కూడా పడుతుందని తెలుగు తమ్ముళ్లు హెచ్చరిస్తున్నారు. అందుకే ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలంటూ చంద్రబాబుకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ ఇలా కనపడుతుంది. "చంద్రబాబు చేసే పనులు ఇట్లాగే ఉంటాయి పవర్ హ్యాండ్ లూమ్ కి ఉచిత విద్యుత్ ఇవ్వచ్చు. కానీ చం నేతన్న ఇళ్లకు కూడా ఉచితంగా విద్యుత్తు ఇస్తానంటున్నారు. వాళ్ల ఓట్లు ఒక నాలుగు లక్షలు ఉంటాయి వీళ్ళకిస్తే మిగతా బీసీ కులాలు కోటి పైన ఓట్లు పోగొట్టుకుంటారు. హ్యూమన్ సైకాలజీ చదివి రాజకీయాల్లోకి రావాలి. ఆ వర్గం నాలుగు ఐదు లక్షలు ఓట్లలో మనకు ఒక 65% పడి ఉంటే జగన్ కు 35% పడి ఉంటాయి . చంద్రబాబు ఇప్పుడు ఉచిత విద్యుత్ ఇస్తానంటున్నాడు. ఇళ్ళకి ఆయన ఉచిత విద్యుత్తు ఇచ్చిన ఒక ఫైవ్ పర్సెంట్ మారుతాయి అంటే ఒక 25 వేల ఓట్లు మారుతాయి కానీ 30 నుంచి 40 లక్షల కోట్లు యాంటీ అవుతాయి. ఈ చిన్న లాజిక్ మర్చిపోతే ఎట్లా?" అని ప్రశ్నించారు. "మా ఊళ్లో కరుడుగట్టిన వైసిపి వాడికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చారు. అతనికి పని చేసి పెట్టారని 100 మంది కార్యకర్తలు యాంటీ అయిపోయారు" అంటూ పోస్టు వైరల్ గా మారింది.

## సజ్జల రామకృష్ణారెడ్డి, భార్గవరెడ్డిలకు ముందస్తు బెయిల్

విజయవాడ, మార్చి 28,సజ్జల రామకృష్ణారెడ్డి,ఆయన కుమారుడు సజ్జల భార్గవరెడ్డి ముందస్తు బెయిల్ పొందారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లపై అనుచిత వ్యాఖ్యల కేసులో ఇటీవల పోసాని కృష్ణమురళిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు పోలీసులకు తను మాట్లాడిన మాటలు, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లపై ఉపయోగించిన భాష అంతా సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్ రెడ్డి ప్రోద్భలం వల్లనే మాట్లాడానని నేరం అంగీకరిస్తూ వాంగ్మూలం ఇచ్చారు. దీంతో తమనూ అరెస్టు చేసే అవకాశం ఉందని భావించి వీరిద్దరూ కోర్టును ఆశ్రయించారు. తమకు ముందస్తు బెయిల్ మంజూరు చెయ్యాలని కోరారు. వారి పిటిషన్ ను విచారించిన హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లెలో నమోదు చేసిన కేసులో అరెస్ట్ చేస్తారన్న ఆందోళన ఉందని వారు కోర్టులో వాదించారు. తాము అమాయకులమని, తమను అనవసరంగా ఈ కేసులో ఇరికిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పోసాని తమ పేర్లను వాంగ్మూలంలో చెప్పారని, అది తప్ప ఇందులో తమ పాత్ర ఉందని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు దృష్టికితీసుకెళ్లారు. రాజకీయ ప్రతీకారంతో తప్పుడు కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గుంటూరు జిల్లాలో, పులివెందులలో తమకు శాశ్వత నివాసాలు ఉన్నాయని, తప్పించుకుపోయే ప్రశ్నే లేదని, అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరవుతామని అన్నారు. కాబట్టి తమను ఈ కేసులో అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోర్టులో కోరారు. ఈ మేరకు కోర్టు బెయిల్ మంజరు చేసింది. వైసీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ లపై ప్రెస్ మీట్ లు పెట్టి రాయలేని భాషలో దుర్భాషలాడారు పోసాని. కూటమి అధికారం లోకి రాగానే తాను ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించి సైలెంట్ అయిపోయారు పోసాని. అయితే గతంలో ఆయన వాడిన భాష తమ మనోభావాలు దెబ్బతీసాయి అంటూ కంప్లైంట్స్ రావడం తో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. అయితే సజ్జల చెబితేనే తాను అలా తిట్టాను అంటూ పోసాని పోలీసులు ముందు ఒప్పుకున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ సోషల్ మీడియా బాధ్యతలను సజ్జల కుమారుడు భార్గవ్ రెడ్డి నిర్వహించారు. అప్పటి సోషల్ మీడియా యాక్టివిస్టులు, అందరు ఫ్రీ లాన్స్ జర్నలిస్టులు, వైసీపీకి అనుకూలంగా పనిచేసిన యూట్యూబర్లు భార్గవ్ రెడ్డి కనుసన్నల్లోనే పనిచేసేవారని అప్పటి ప్రతిపక్షమైన టిడిపి జనసేన పార్టీల నేతలు కార్యకర్తలపై సోషల్ మీడియాలో చెప్పలేని భాషతో విరుచుకుపడింది భార్గవ్ రెడ్డి సూచనలతోనే అని టిడిపి జనసేన నాయకులు ఆరోపిస్తూ ఉంటారు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలన్నీ వాటిని దృష్టిలో పెట్టుకుని తమను అరెస్టు చేసే దిశగా నడుస్తున్నాయని భావించిన భార్గవ్ రెడ్డి ,అయన తండ్రి సజ్జల ముందస్తు బెయిల్ పొందారు.

# కొరకుగాని కొయ్యలా మారుతున్న అధికారులు

తిరుపతి, మార్చి 28, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత వైసీపీ హాయంలో పనిచేసిన అఖిల భారత సర్వీసు అధికారులు ఆ పార్టీ కార్యకర్తల్లా పనిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కూడా వారు కూటమి ప్రభుత్వం అంటే లెక్క లేనట్లు వ్యవహరిస్తున్నారని టిడిపి నేతలు సీరియస్ అవుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ పరిస్థితి దారుణంగా ఉందని నాయకులు వాపోతున్నారట. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వ్యవహరిస్తున్న తీరుతో అసలేం జరుగుతుందో అంతుపట్టడం లేదని క్యాడర్ వాపోతోంది. సీఎం వచ్చినప్పుడు మాత్రం తల ఊపి తర్వాత తమదైన రీతిలో ఇష్టానుసారం వ్యవహారిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. సీఎంఓలోని కొంతమంది అధికారుల సహకారంతో వారు ఆడింది అట పాడింది పాటగా తయారైందంట.చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు తీరుపై బహిరంగంగా విమర్శలు చేసారు మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకుడు, పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి. పుంగనూరులో టిడిపి కార్యకర్త రామకృష్ణను వైసీపీ కార్యకర్తలు, నాయకులు కలసి హత్య చేశారు. దానిపై అమర్‌నాథ్ మదనపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఎస్పీ ఇప్పటికి వైసీపీ తొత్తులుగా ఉన్న పోలీసులను కొనసాగిస్తున్నారని విమర్శించారు. దాన్ని మనసులో పెట్టుకొని ఎస్పీ ఏకంగా వందలాది పోలీసులను ఇష్టానుసారం బదిలీలు చేసారని తాజాగా అమర్నాథ్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న వారిని బదిలీ చేయమంటే అందరిని బదిలీ చేసి వారి పెళ్ళాం పిల్లల చేత తనను తిట్టిస్తున్నారని మండిపడ్డారు.బదిలీల సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధుల ఇచ్చిన సిఫార్సులను బుట్ట దాఖాలు చేసారట. క్షేత్ర స్థాయిలో డిఎస్పీ, సీఐలను కనీసం వారి గురించి ఏమాత్రం డేటా తీసుకోకుండా నాలుగు సంవత్సరాలు, ఐదు సంవత్సరాల స్టాండింగ్ పేరుతో బదిలీ చేశారని, దాంతో పాటు మహిళ పీఎస్‌లో రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న వారిని తీసుకెళ్ళి సమస్యాత్మక స్టేషన్‌లకు పంపారంట. మొత్తం మీదా కావాలనే టిడిపికి చెడ్డ పేరు వచ్చే విధంగా అయన చేశారని అంటున్నారు.జిల్లాలో రెవెన్యూతో పాటు ఇతర శాఖలలో కూడా ఇదే పరిస్థితి ఉందంట. గత ప్రభుత్వంలో కీలక శాఖలలో కొనసాగిన వారికి ఇన్ చార్జ్ బాధ్యతలు ఇచ్చి కొనసాగిస్తున్నారంట. గతంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఓఎస్డీగా పనిచేసిన వ్యక్తికి కీలక బాధ్యతలు ఇచ్చారని ఒక ఎమ్మెల్యే సీఎంఓ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంట. అదే విధంగా తిరుపతి నగరపాలక సంస్థలో కమిషనర్ కూటమి నేతలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసారట. గతంలో డిప్యూటేషన్ పై వచ్చిన నగర పాలక సంస్థ డిప్యూటి కమిషనర్‌ను బదిలీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా ఏమాత్రం పట్టించుకోకుండా కొనసాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.అన్నమయ్య జిల్లాలో జిల్లా జాయింట్ కలెక్టర్ కూటమి నేతలకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదంటున్నారు. తంబల్లపల్లి, మదనపల్లిల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు దందాలకు పాల్పడుతున్నారనే అరోపణలు ఉన్నాయి. అధికారుల తీరుతో విసిగి పోతున్నామని కార్యాకర్తలు వాపోతున్నారు. వారందరు సిఎంఓ తమకు అండగా ఉందని అంటున్నారట. నాయకుడు ఎవరైనా ప్రశ్నిస్తే సిఎంఓలోని ఓ అధికారి పేరు చెబుతున్నారంట. గతంలో తిరుపతి నగర పాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ ఎంపికలో టిడిపికి చెందిన న్యాయవాదికి కాకుండా మరో వ్యక్తి కి ఇవ్వడానికి ప్రయత్నించారు. అప్పుడు నిలదీస్తే కమిషనర్ సిఎంఓలోని ఒక అధికారి పేరు చెప్పి బెదిరించారంట.గతంలో డిప్యూటేషన్ మీద వచ్చిన అర్డీఓలను యధావిధిగా కొనసాగిస్తున్నారు. వారంత వైసీపీ సానుభూతిపరులన్న ఆరోపణలున్నాయి. చివరకు పదవి విరమణ పొందిన అధికారిని సైతం సలహాదారుగా కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో డిప్యూటేషన్ పై వచ్చిన వారిని బయటకు పంపడానికి మీనామేషాలు లెక్కిస్తున్నారట. మొత్తం మీద ఎన్నికలలో తాము కష్ట పడి పనిచేసామా? లేకా అఖిల భారత సర్వీసు అధికారులు పనిచేసారా అని నాయకులను కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారట. మరో వైపు గత 9నెలలుగా జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై సీనియర్ నాయకులు గళం విప్పడానికి సిద్ధమవుతున్నారట. అత్మాభిమానం చంపుకుని అధికారుల పెత్తనంలో బతకడం కంటే రాజకీయాలకు దూరం కావడం మేలని చాలామంది సీనియర్ కార్యకర్తలు, పార్టీ అవిర్భావం నుంచి పనిచేసిన వారు అభిప్రాయపడుతున్నారు.

# తిరుమలలో సేంద్రియ ఉత్పత్తుల బండారం

తిరుమల, మార్చి 28, కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరుడు.. ఆపద మొక్కుల స్వామి. అందుకే క్షణం పాటు వెంకన్న దర్శనం దొరికితే చాలు అన్నది భక్తుల ఆశ. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసలు లెక్క చేయక శ్రీవారి దర్శనం కోసం పరితపిస్తారు. శ్రీవారి నిత్య నైవేద్యాలు, ప్రసాదాల పరమ పవిత్రంగా భావిస్తుంటారు. అలాంటి ప్రసాదాల కోసం సరఫరా చేసిన సేంద్రియ ఉత్పత్తుల బండారం బయట పడింది. ఆర్గానిక్ సరుకుల వ్యవహారంలో డొంక కదిలింది. నిబంధనలకు విరుద్ధంగా దాతలకు ప్రయోజనాలు చేకూర్చినట్లు తేలడంతో టీటీడీ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆర్గానిక్ ప్రసాదాల తయారీని నిలిపి వేసిన టీటీడీ అంతులేని ప్రయోజనాలను పొందిన దాతలకు చెక్ పెట్టింది.తిరుమల శ్రీవెంకటేశ్వరుడు అలంకార ప్రియుడే కాదు. మంచి భోజన ప్రియుడు కూడా. అందుకే వెంకన్నకు రోజు వివిధ రకాల నిత్య నైవేద్యాలు ప్రసాదాలు శ్రీవారి వంటశాలలో తయారవుతాయి. ఎంతో రుచి సువాసన భక్తులను నోరూరించేలా ఉంటాయి. అయితే అలాంటి ప్రసాదాల తయారీ లో గత ప్రభుత్వం అపచారం జరిగిందన్న కూటమి ప్రభుత్వం సేంద్రియ ఉత్పత్తుల సరఫరాలో జరిగిన లాలూచీని బయటపెట్టింది.శ్రీ వెంకటేశ్వర నిత్య నైవేద్యాలకు ఆర్గానిక్ సరుకులను వాడాలని తీర్మానించిన గత ప్రభుత్వం, ఇందులో భాగంగానే అప్పట్లో రైతుల నుంచి సేంద్రియ ఉత్పత్తులను సేకరించింది. ఈ మేరకు నిర్ణయించి అమలు చేసింది. 2021లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించి, సేంద్రియ ఉత్పత్తులతో వెంకన్న నిత్య నైవేద్యాలు తయారు చేసేందుకు టీటీడీ ఉపక్రమించింది. ఈ మేరకు తయారు చేసిన ప్రసాదాలు రుచిగా లేవన్న ఆరోపణలు అప్పట్లో వచ్చినా టీటీడీ పెద్దగా పట్టించుకోకుండానే ఆర్గానిక్ ఉత్పత్తులతోనే ప్రసాదాల తయారీ కొనసాగించింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్గానిక్ ఉత్పత్తులతో తయారు చేస్తున్న ప్రసాదాలను నిలిపి వేసింది. ఈ వ్యవహారంపై టీటీడీ పాలక మండలి కూడా దృష్టి పెట్టింది. ఎవరి ప్రయోజనాల కోసం సేంద్రియ ఉత్పత్తులను ప్రసాదాల తయారీ కోసం వినియోగించారు. సరఫరా చేసిన వాళ్లకు, దాతలుగా ఆర్గానిక్ సరుకులు ఇచ్చిన వారికి సమకూర్చిన ప్రయోజనాలపై ఆరా తీసింది.ఈ మేరకు గతేడాది అక్టోబర్ లో జరిగిన పాలక మండలిలోనే ఈ వ్యవహారం చర్చకు వచ్చింది. నాసిరకం సరుకులకు చెక్ పెట్టి ప్రసాదాల తయారీలో నాణ్యత పెంచిన టీటీడీ ఆర్గానిక్ ఉత్పత్తుల వ్యవహారంపై విజిలెన్స్ విచారణ నిర్వహించింది. గత ప్రభుత్వ హయంలో టీటీడీకి ఆర్గానిక్ సరుకులు సరఫరా చేసిన వారి వివరాలను సేకరించింది. పొందిన ప్రయోజనాలపై దృష్టి పెట్టిన విజిలెన్స్, ప్రకృతి వ్యవసాయం చేసి ఉత్పత్తులను టీటీడీకి సరఫరా చేసిన రైతులను ఆరా తీసింది. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అమలాపురం కు చెందిన శ్రీనివాస సేవా ట్రస్ట్ పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాకం వెలుగు చూసింది.నిమ్మకాయల సత్యనారాయణ అనే వ్యక్తి సేంద్రియ ఉత్పత్తులను సరఫరా చేయడం ద్వారా అంతులేని ప్రయోజనాలు పొందినట్లు గుర్తించిన విజిలెన్స్ ఈ మేరకు లోతుగా దర్యాప్తు నిర్వహించింది. ప్రకృతి వ్యవసాయం చేసి టీటీడీకి సేంద్రియ ఉత్పత్తులను సరఫరా చేసిన రైతులు 85 మంది వరకు ఉన్నారని, వాళ్లను దాతలుగా గుర్తించి డొనేషన్ పాసు పుస్తకాలు జారీ చేసినట్లు గుర్తించింది. శ్రీవారికి రూ.10 లక్షలు డొనేషన్ చేసే దాతలకు ఇచ్చే ప్రివిలైజ్‌ను కల్పించిన టీటీడీ ఈ మేరకు డొనేషన్ పాస్ పుస్తకాలులను జారీ చేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. ఏడాదిలో మూడుసార్లు శ్రీవారిని వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకునేందుకు ఛాన్స్ ఉన్న డొనేషన్ పాస్ పుస్తకాన్ని పొందిన సత్యనారాయణ ఈ వ్యవహారంలో కింగ్ పిన్ గా గుర్తించింది. ప్రకృతి వ్యవసాయం చేసి సేంద్రియ ఉత్పత్తులను టీటీడీకి సరఫరా చేశామన్న రైతుల వద్దకే వెళ్లి వివరాలు సేకరించింది. ఇందులో చాలామంది రైతులు అలాంటి ఉత్పత్తులు సాగు చేయలేదని, కొందరు రైతులే కాదని తేలింది. దీంతో అవాక్కైనా టీటీడీ మూడు రోజుల క్రితం జరిగిన బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. టీటీడీకి సేంద్రీయ సరుకుల పేరుతో నాసిరకం సరుకులు సరఫరా చేసినట్లుగా భావించింది.

# తెరపైకి పీ 5 పాలసీ

గుంటూరు, మార్చి 28,ఏపీలోవిప్లవాత్మక పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా మార్చాలని భావిస్తోంది. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా పావులు కదుపుతోంది ఏపీ ప్రభుత్వం. ఉగాది నుంచి పి ఫోర్ పాలసీని ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అమరావతిలో రెండు రోజులపాటు కలెక్టర్ల సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. పేదరికం లేని ఏపీ కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాగా కలెక్టర్ల సదస్సులో ఈసారి పి ఫోర్ అంశమే ప్రాధాన్యంగా నిలిచింది. ' పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ ఫార్చునర్ షిప్'.. ఇలా పి ఫోర్ గా తీసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. అదే విషయాన్ని కలెక్టర్ల సదస్సులో వివరించి ప్రయత్నం చేశారు. ఇప్పటికే స్వర్ణాంధ్ర 2047 టార్గెట్ పెట్టుకున్న సంగతి తెలిసిందే. అందులో పది సూత్రాలను పరిగణలోకి తీసుకున్నారు. అందులో 0 పేదరికం ఒకటి. ఆర్థిక అంతరాలు తగ్గించేందుకు అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

## ఈ-కేవైసీని నిర్లక్ష్యం చేస్తే చర్యలు--

**మండల తాసిల్దార్ శ్రీనివాసులు---**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28-రేషన్ కార్డు దారులకు సకాలంలో ఈ-కేవైసీ చేయించాలలని , నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు ఈనెల 31వ తేదీ లోగా చేయించకపోతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## పదవ తరగతి జీవశాస్త్రం పరీక్షకు 24.5౯౨ మంది హాజరు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28- పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో భాగంగా శుక్రవారం నిర్వహించిన జీవ శాస్త్రం పరీక్షకు 24592 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా130 పరిక్షా కేంద్రాల్లో



25141 విద్యార్ధులకు గాను 24592 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 549 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా డీఈవో జనార్ధన్ రెడ్డి ఒ ప్రకటన లో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 19 పరీక్షాకేంద్రాలను మరియు జిల్లా విద్యాశాఖాధికారి, 03 పరీక్షాకేంద్రములను పరిశీలించారు . అదేవిదంగా స్టేట్ అబ్జర్వర్ . అబ్రహం 6 పరీక్ష కేంద్రాములను తనీఖీ చేశారు. రిజినల్ జాయింట్ డైరెక్టర్ కె. శామ్యూల్, 4 పరీక్షాకేంద్రములను పరిశీలించారు. ఈ రోజు మొత్తం 58 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడం జరిగింది. ఆరు సమస్యాత్మాక కేంద్రాలలో ఆరుగురుని సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి, మరియు 20 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి, సజావుగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు .

## ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ పొందండి--

**అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాసు---**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28- పట్టణ ప్రజలు తమ ఆస్తి పన్నుల బకాయిలను వెంటనే చెల్లించి ప్రభుత్వం కల్పించిన రాయితీని పొందాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు. ఆర్ ఓ అంజనేయులు కలసి పట్టణంలో పలు దుకాణాల దారులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఈ నెల 31లోపు చెల్లించి పన్నుల వడ్డీపై 50 శాతం మినహాయింపు పొందాలని కోరారు. మున్సిపాల్టీ కార్యాలయం వద్ద నగదు కౌంటర్లు అందుబాటులో ఉంచామని, ఉదయం 8 నుంచి రాత్రి వరకు పనిచేస్తాయని వెల్లడించారు. 44 సచివాలయా ల్లోనూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పన్నుల బకాయిల సొమ్ము స్వీకరించేం దుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

## నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్‌గా గుంటుపల్లి హరిబాబు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28- నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ గా జి హరిబాబును కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ విషయం తెలుసుకున్న రైతునగరం వాసులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వానికి మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ కు ధన్యవాదాలు తెలిపారు.



## సాక్షి కార్యాలయంపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అఖిల ప్రియ పై చర్యలు తీసుకోవాలి



**.ప్రజాస్వామ్య పద్దతిలో వ్యవహరించాలి.**

**వాస్తవాలు రాస్తున్న జర్నలిస్ట్ కు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి.**

**తక్షణమే జర్నలిస్టులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలి**

**ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా**

విభారే న్యూస్ కర్నూల్ ప్రతినిధి మార్చి28నేటి సమాజంలో వాస్తవాలు రాస్తున్న జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందని రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం ముందు నగర అధ్యక్షుడు శివ శంకర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి. గోరంట్లప్ప,కెబి. శ్రీనివాసులు జిల్లా కన్వీనర్ కె నాగేంద్ర,ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ జర్నలిస్ట్ లు ధరణి కిషోర్,హుస్సేన్,ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుస్సేన్,సుబ్రహ్మణ్యం, సీనియర్ జర్నలిస్ట్ లు సత్యనారాయణ గుప్తా,రవి ప్రకాష్ ,సాక్షి బ్యూరో రవి వర్మ,కరస్పాండెంట్ లోకేష్ లు మాట్లాడుతూ వాస్తవాలు రాసిన జర్నలిస్ట్ లపై దాడులు చేయడం ఆయా కార్యాలయాలపై దాడులకు పాల్పడటం జర్నలిస్టులను భయాందోళనకు గురిచేయడం సరైంది కాదన్నారు. ఇంకొకటి.ప్రజాస్వామ్య పద్దతిలో పోరాటం చేయడం మానేసి అధికార పార్టీలో ఉండే ఎమ్మెల్యే అఖిల ప్రియ తమ అనుచరులతో సాక్షి కార్యాలయం పైకి దాడికి దిగి భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు.పాలకవర్గాలు జర్నలిస్ట్ లకు రక్షణ కల్పించడం మానేసి దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం 9 నెలల కాలంలో రోజు రోజుకు జర్నలిస్ట్ పై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు,జర్నలిస్ట్ కు అండగా రక్షణ గా ఉండాలని అధికార పార్టీ ఎమ్మెల్యే లు పద్దతితో ఉండాలని పలుమార్లు హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే లలో చలనం రావడం లేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి జర్నలిస్ట్ లకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని తక్షణమే ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గతంలో గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం జర్నలిస్ట్ లను రైలు పట్టాలపై పడుకో పెడతానాని బెదిరించారు.నేడు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిల ప్రియ ఇలా అధికార పార్టీ వారు బరితెగించడం రాష్ట్ర ప్రభుత్వానికి కలంకకంగా మారడం సిగ్గుచేటన్నారు.ఇప్పటికైనా జర్నలిస్ట్ లకు రక్షణ గా రాష్ట్ర ప్రభుత్వం ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి ఎర్రమల,ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నర్సిరెడ్డి,మద్దిలేటి, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు,జర్నలిస్ట్ లు జమ్మన్న ,శ్రీనివాసులు ,ప్రతాప్, పరమేష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు చంద్ర శేఖర్,శేఖర్, అనిల్,నగేష్, మరియు డెస్క్ జర్నలిస్ట్ లు,తదితరులు పాల్గొన్నారు.

## జమ్ కేర్ కామినేని హాస్పటల్లో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్ విజయవంతం

విభారే న్యూస్కర్నూలు ప్రతినిధి... కర్నూలు నగరంలోని జమ్ కేర్ కామినేని హాస్పిటల్లో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రవిబాబు తెలిపారు. నంద్యాల జిల్లా గాజులపల్లికి చెందిన జయమ్మ అనే పేషెంట్ కు గత సంవత్సరం జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ లో మోకాలు మార్పిడి చేశామని, ఆమెకు 6 నెలల నుండి కీళ్ల నొప్పులు అధికమై చెయ్యి కూడా పైకి ఎత్తలేని పరిస్థితుల్లో హాస్పిటల్ లో చేరిందని.




ఆమెకు ఎమ్మారై, ఎక్స్ రే అన్ని రకాల టెస్టులు చేసిన అనంతరం కుడి భుజం ఎముకలు పూర్తిగా అరిగి పోయినట్లు నిర్ధారణ జరిగిందన్నారు. ఈ వ్యాధిని ఆంకలోసిస్ అంటారని, దీనికి ఉత్తమ చికిత్స భుజం మార్పిడి చేయడమేనని, భుజం మార్పిడి ఆపరేషన్ చాలా క్లిష్టమైనదన్నారు. ఈ ఆపరేషన్ ప్రముఖ నగరాలైన హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో మాత్రమే చేస్తున్నారని. ఈ ఆపరేషన్ ఇప్పుడు కర్నూలు నగరంలో జమ్ కేర్ కామినేని హాస్పిటల్ లో చేశామని డాక్టర్ రవిబాబు తెలిపారు. భుజం మార్పిడిలో కాంప్లెక్స్ ప్రొసీజర్ రివర్స్ షోల్డర్ ఆర్థోప్లాస్టి చేశారు. దీనివల్ల రోగికి భుజం కదలిక పూర్తిగా వచ్చింది. ప్రస్తుతం పేషంటు ఫిజియోథెరపీ చికిత్సతో కోలుకుంటున్నదని డాక్టర్ రవి బాబు తెలిపారు. ఈ ఆపరేషన్ లో మత్తు డాక్టర్లు ఆదిత్య, మాధవి తదితర బృందం పాల్గొన్నారు. ఎటువంటి కీళ్లు, ఎముకలు వ్యాధులకైనా జెమ్ కేర్ హాస్పిటల్ లో అత్యుత్తమ చికిత్సలు, ఆపరేషన్ లు చేస్తామన్నారు. జమ్ కేర్ కామినేని హాస్పిటల్ లో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేసినందుకు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాలమురళీకృష్ణ, డాక్టర్ రామమోహన్ రెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ ఆదిత్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ గణేష్, నదీమ్, కృష్ణవేణి, ఆపరేషన్ చేసిన డాక్టర్ రవిబాబుకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.డాక్టర్ రవిబాబు గురించి క్లుప్తంగా చెప్పాలంటే డాక్టర్ రవిబాబు ఎంబీబీఎస్, ఎంఎస్ కర్నూలు నగరంలోని మెడికల్ కాలేజీలో చదివారు. ఫెలో షిప్, స్పోర్ట్స్ ఇంజురీస్, ఆర్థో ప్లాస్టి బెంగళూరు కేరళలో పూర్తి చేశారు. అబ్జర్వర్షిప్ జర్మనీ, సింగపూర్ లో చేశారు. ఇప్పుడు కర్నూలు నగరంలోని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్లో అత్యుత్తమ సేవలందిస్తున్నారు.

## రైతుల పెట్టుబడి తగ్గాలి...తలసరి ఆదాయం పెరగాలి--

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28-జిల్లాలో ఖరీఫ్ చివరలో 2 లక్షల ఎకరాల్లో మూడు నెలలు సెనగ పంట సాగుకు మాత్రమే పరిమితమై మిగిలిన కాలాన్ని వృధాగా ఉంచుతున్న బీడు భూముల్లో ఉద్యాన పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో నాణ్యమైన ఉల్లి, మిర్చి, పసుపు పెంపకం కోసం హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వర్క్ షాప్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. హార్టికల్చర్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, మార్క్ ఫెడ్ డిడి హరినాథ్ రెడ్డి, నాబార్డు డిడిఎం సుబ్బారెడ్డి, మహానంది హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డా.ముత్యాలనాయుడు, కిషోర్ కుమార్,




యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు, ఐటిసి సంస్థ మేనేజర్ విష్ణువర్ధన్, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి వెంకట్ గౌడ్, ఎఫ్పిఓలు, హార్టికల్చర్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో ఖరీఫ్ చివరిలో మూడు నెలలు మాత్రమే 2 లక్షల ఎకరాల్లో సెనగ పంట వేసి తర్వాతి 9 నెలల సమయమంతా బీడు భూములుగా వదిలేస్తున్నారని సంబంధిత భూముల్లో ఉద్యాన పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. సదరు మండలాల జీవన ప్రమాణాల కంటే ఇతర మండలాల తలసరి ఆదాయం ఎక్కువగా వుంటోందన్నారు. దీంతో రైతాంగంతో పాటు జిల్లా అభివృద్ధికి నష్టం వస్తుందని సంబంధిత భూముల్లో ఉద్యాన వాణిజ్య పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 43 శాతం అభివృద్ధి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారానే రంగాల పైనే ఆధారపడి ఉందని కలెక్టర్ తెలిపారు. అలాగే సర్వీసు విభాగం నుండి 39 శాతం, పరిశ్రమల నుండి 18 శాతం అభివృద్ధికిదోహదపడుతున్నాయన్నారు. ప్రధానంగా ఉద్యాన శాఖ నుండి 7వేల కోట్లు,పశు సంవర్ధక శాఖ నుండి మరో 7 వేల కోట్లు, వ్యవసాయ శాఖ నుండి 3 వేల కోట్లు, చేపల పెంపకం ద్వారా వెయ్యి కోట్లు వెరసి మొత్తం 17 వేల కోట్లు జిల్లాకు గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్ గా ఆదాయం వస్తుందని కలెక్టర్ తెలిపారు. రానున్న రోజుల్లో 17 వేల కోట్ల నుండి 22 వేల కోట్ల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటూ రైతుల పెట్టుబడి తగ్గించి తలసరి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి--

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా--**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 28-జిల్లాలో విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉగాది ఉత్సవ వేడుకలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్రీ విష్ణు చరణ్, డిఆర్ ఓ రాము నాయక్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ తెలుగువారి ప్రతిష్టాత్మక పండుగ అయిన విశ్వావసు నామ ఉగాది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ రోజు పంచాంగ శ్రవణము, కవి సమ్మేళనము, పురస్కారాల ప్రధానము, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెలుగుదనం ఉట్టిపడేలా ఆడిటోరియంను తీర్చిదిద్దడంతోపాటు, మామిడి తోరణాలు అరటి బోదెలు, రంగవల్లులు తదితర అలంకారాలను చేపట్టాలన్నారు. పంచాంగ శ్రవణానికి సంబంధించి మంచి కంఠ స్వరం గల పురోహితులను గుర్తించడంతోపాటు పూజకు అవసరమైన వస్తు సామాగ్రిని సమకూర్చుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ ను ఆదేశించారు. తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓ జనార్ధన్ రెడ్డిని ఆదేశించారు. కవి సమ్మేళనం, అష్టావధానం ఆకట్టుకునేలా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు, క్రీడలు, వైద్య, విద్య ఇతర సాంస్కృతిక రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పురస్కార గ్రహీతలను గుర్తించి తీసుకురావాలని యువజన సంక్షేమ అధికారి, డీఈఓ లను కలెక్టర్ ఆదేశించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, తదితర అల్పాహార ఏర్పాట్లను చేయాలని డిఎస్ఓ ను సూచించారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులతో పాటు త్రాగునీటి సదుపాయం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం ఎవరు మిస్ కాకుండా ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులను ఆహ్వానించాలని నంద్యాల రూరల్, అర్బన్ తాసిల్దార్లను ఆదేశించారు.

## పండుగ రోజుల్లో సైతం పన్నులు చెల్లించవచ్చు

**నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ వెల్లడి**

**50% వడ్డీ రాయితీ ఈ నెల 31తో ముగింపు**

**ఉదయం 9 నుండి రాత్రి 9 వరకు పన్ను వసూళ్లు**

కర్నూలుఈ నెల 30, 31వ తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో సైతం ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలను ప్రజలు చెల్లించవచ్చని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి క్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో, ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 50% వడ్డీ రాయితీని ప్రజలు అధిక సంఖ్యలో వినియోగించుకుంటున్నారని, సెలవు దినాల్లో సైతం పన్నులను చెల్లించవచ్చని సూచించారు. ఆది, సోమవారాల్లో ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 వరకు నగరపాలక కార్యాలయంలోని పన్ను వసూలు కేంద్రంతో పాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సైతం పన్నులు చెల్లించవచ్చన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**